సాక్షి వికారాబాద్

గురువారం । 12 । జూన్ । 2025



విత్తనశుద్ధితో తెగుళ్లకు..

విత్తనశుద్ధితో పంటలకు ఆశించే తెగుళ్లకు చెక్ పెట్టవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అలివేలు తెలిపారు. 8లో▸



ముగిసిన ఎల్లమ్మ జాతర

భక్తుల కొంగు బంగారంగా విశ్వసించే కొత్లాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర బుధవారంతో ముగిసింది. 8లో▸



భయపెడుతున్న బడి

దుద్యాల్ మండలంలో పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వెళ్లేందుకు విద్యార్థులు జంకుతున్నారు. 9లో▸

ఘనంగా ఏరువాక పౌర్ణమి



అనంతగిరి: మద్గుల్ చిట్టంపల్లిలో ఎడ్ల ప్రదర్శన

ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా రైతులు ఘనంగా జరుపుకొన్నారు. వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందు వచ్చే తొలి పండుగ కావడంతో అన్నదాతలు ఎద్దులను శుభ్రంగా కడిగి అందంగా ముస్తాబు చేశారు.. వాటికి ఇష్టమైన ఆహారాన్ని అందించారు.. ప్రత్యేక పూజలు చేశారు.. సాయంత్రం ఆలయాల వద్దకు వెళ్లి ఎద్దుల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. – వికారాబాద్



బొంరాస్‌పేట: రేగడిమైలారం గ్రామంలో హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్లబండ్లతో ప్రదక్షిణ

న్యూస్‌రీల్

విద్యార్థులకు అభినందనలు



క్రీడా పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థులతో అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: వివిధ ప్రాంతాల్లోని క్రీడా పాఠశాలలో సీట్లు సాధించిన 9మంది గిరిజన విద్యార్థులను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అభినందించారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడా పాఠశాలలో) బోయినపల్లి, హైదరాబాదు నందు కాయకింగ్, కేనోయింగ్, ఫెన్సింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ నందు అడ్మిషన్లు కోసం రాష్ట్ర స్థాయి పరీక్షలు జరిగాయి. జిల్లా నుంచి 9మంది గిరిజన విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని అదనపు కలెక్టర్ సుధీర్ అభినందించారు. చదువుతో పాటు వాటర్ స్పోర్ట్స్ విభాగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, విద్యార్థుల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన మాజీ వైస్ ఎంపీపీలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండల నాయకులు

పరిగి: రాష్ట్ర మంత్రి మండలిలో నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి గడ్డం వివేక్‌ను మండల మాజీ వైస్ ఎంపీపీలు మాణిక్యం, సత్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని మంత్రి సూచించినట్టు వారు తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



అర్జీలను పరిశీలిస్తున్న ఉమాశంకర్ ప్రసాద్

యాలాల: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని దౌలాపూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రైతులు ఇచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దౌలాపూర్‌తో పాటు ముద్దాయిపేటలో నిర్వహించిన సదస్సులో ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ వేణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తు చేసుకోండి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయసుధ

అనంతగిరి: ప్రధాన మంత్రి బాల పురస్కార్ అవార్డులకు అర్హులైన పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయసుధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ రంగాల్లో ప్ర తిభ కనబర్చిన బాలలు ప్రధాన మంత్రి రాష్ట్రీ య బాల పురస్కార్ అవార్డు 2025కు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. క్రీడలు, నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, కళలు, సంస్కృతి, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాల్లో ప్రతిభ కనబర్చిన 18 సంవత్సరాల లోపు బా లలు అవార్డుకు అర్హులన్నారు. జూలై 31లోపు హెచ్‌టిటిపిఎస్ //అవార్డ్స్ . జిఓవి. ఇన్‌వెబ్ సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

నేడు చెన్నారంలో ట్రాక్టర్ల రివర్స్ డ్రైవింగ్ పోటీలు

యాలాల: మండలంలోని చెన్నారం గ్రామంలో గురువారం ట్రాక్టర్ల రివర్స్ డ్రైవింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు యువ రైతు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఏరువాక పండుగతో పాటు తన తండ్రి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో నిర్దేశిత ప్రదేశానికి తక్కువ సమయంలో ట్రాక్టర్‌ను రివర్స్‌లో చేరుకుంటారో వారు విజేతగా నిలుస్తారని తెలిపారు. గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు రైతు తెలిపారు.

మోగనున్న బడి గంట

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- మౌలిక సదుపాయాలతో సరి
- ఎప్పటిలాగే సమస్యలతో స్వాగతం
- జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,063
- విద్యార్థులు 80 వేల మంది
- సమస్యలు లేకుండా చూడండి: కలెక్టర్



వికారాబాద్: సుదీర్ఘ సెలవుల తర్వాత నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎప్పటిలాగే ఈ సారి కూడా విద్యార్థులను సమస్యలే స్వాగతం పలకనున్నాయి. వేసవి సెలవుల్లో ఆహ్లాదంగా గడిపిన చిన్నారులు గురువారం నుంచి బడి బాట పట్టనున్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చి పదేళ్లు దాటినా విద్యార్థుల సమస్యలు తీరిన దాఖలాలు లేవు.. మన ఊరు – మన బడి, అమ్మా ఆదర్శ పాఠశాలలు లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన మేర విద్యార్థులను ఆకర్శించలేకపోతున్నాయి. ప్రభుత్వ బడులలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా సమస్యలు కొలిక్కి రాలేదనే చెప్పాలి. ఇంకా వందకు పైగా పాఠశాలల్లో మరమ్మతులు అవసరమని అధికారులు తేల్చారు. సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాకుండానే పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో వచ్చే విద్యార్థులకు కొంత మేర సమస్యలు తగ్గినప్పటికీ ఇంకా పలు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో ఫలితాలు కనిపిస్తున్నా.. అకాడమిక్ విషయంలో పెద్దగా మార్పు కనిపించలేదనే చెప్పాలి.

నేడు పుస్తకాలు, దుస్తుల పంపిణీ

జిల్లాలో మొత్తం 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 80వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాది వారం రోజుల ముందుగానే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు స్కూళ్లకు చేర్చారు. విద్యార్థులకు యూనిఫారాలు సిద్ధంగా ఉంచారు. పాఠశాలల ప్రారంభం రోజునే వీటిని అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సారి నోటు పుస్తకాలను కూడా ఉచితంగా అందించనున్నారు.

పాఠశాలల పర్యవేక్షణలో కీలక భూమిక పోషించే డిప్యూటీ డీఈఓ వ్యవస్థకు స్వస్తి పలకగా.. 20 మండలాలకు ఒక్క రెగ్యులర్ ఎంఈఓ కూడా లేకుండా ఇంచార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఈ ప్రభావం ఫలితాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మూడేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా చివరి వరుసలో నిలవడం ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. ఇకనైనా పరీక్షల సమయంలోనే హడావుడి చేయకుండా అకాడమిక్ మానిటరింగ్ విషయంలోనూ దృష్టి సారించాలని విద్యాభిమానులు, విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫాంల సిద్ధం

ఈ ఏడాది మొదటి విడతలో 79,049 యూనిఫారాలు అవసరమని ఇండెంట్ చేయగా ఇప్పటి వరకు 74,967 అంటే 95 శాతం పాఠశాలలకు చేర్చారు. 5,27,290 పాఠ్యపుస్తకాలు అవసరమని కాగా 4,84,211 అంటే 92 శాతం పాఠశాలలకు చేర్చారు. ఇక 5,79,894 నోటు పుస్తకాలు అవసరమని కాగా 5,21,904 అంటే 92 శాతం బడులకు చేరవేశారు.

పండుగలా జరగాలి

ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం పండుగ వాతావరణంలో జరగాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలు మొదటి రోజే పంపిణీ చేయాలని సూచించారు.. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన అడిషనల్ కలెక్టర్ సుధీర్, డీఈఓ రేణుకాదేవి, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హెచ్‌ఎంలు, ఎంఈఓలకు పలు సూచనలు చేశారు. బడుల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. పాఠశాలల ఆవరణలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైకప్పులపై నీరు నిల్వ ఉంటే లేకుండా చేసుకోవాలన్నారు. ఆవరణ, పాఠశాల గదులు మొత్తం శుభ్రం చేసుకోవాలన్నారు. కిచెన్ షెడ్ల శుభ్రంగా చేయాలన్నారు. షెడ్లు లేకుంటే ప్రతిపాదనలు పంపాలన్నారు. బియ్యం, వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసుకోవాలని ఆసూచించారు. బడీడు పిల్లలందరూ పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హెచ్‌ఎంలు, ఎంఈఓలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- మహిళా అభ్యర్థులకు అవకాశం
- కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక
- డీఈఓ రేణుకాదేవి



అనంతగిరి: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రేణుకాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంటెంట్ పోస్టులు 6, ఏఎన్‌ఎం పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. కేజీబీవీ దోమ, బషీరాబాద్, కొట్పల్లి, పెద్దేముల్, చౌడపూర్, బొంరాస్‌పేటలో అకౌంటెంట్ పోస్టులు, కేజీబీవీ చౌడాపూర్, నవాబుపేట, అలాగే ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలలో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అకౌంటెంట్ పోస్టుకు గ్రాడ్యుయేషన్ ఇన్ కామర్స్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ (ఎంఎస్ వర్డ్ – ఎక్సెల్) లేదా బీకాం కంప్యూటర్స్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఏఎన్‌ఎం పోస్టుకు ఇంటర్మీడియట్‌తో పాటు ఏఎన్‌ఎం సర్టిఫికెట్(ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్) ఉండాలన్నారు. అకౌంటెంట్ కోసం కామర్స్ డిగ్రీ చేసిన వారికి 75 శాతం, పీజీ ఎంకామ్ చేసిన వారికి 25శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎం కోసం ఇంటర్, ఏఎన్‌ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్న వారికి 45శాతం, ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ ఉన్న వారికి (జీఎన్‌ఎం ట్రైనింగ్ 5 మార్కులు, బీఎస్సీ నర్సింగ్ 10 మార్కులు) అదనపు వెయిటేజ్ ఇవ్వబడుతుందని వివరించారు. 25 నుంచి 40 సంవత్సరంలోపు వయస్సు కలవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు..

దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 23 వరకు అవకాశం
- అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన మహిళా విద్యార్థినులు ఈ నెల 23 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్‌కు సంబంధించిన డిగ్రీ మహిళా కళాశాల మొయినాబాద్ మండలం, తోలు కట్ట సమీపంలో ఉందన్నారు. కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ), బీకాం (బీఏ, సీఏ), బీఏ (హెచ్‌ఈపీ) కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమో (అటెస్టెడ్ గెజిటెడ్ ఆఫీసర్), కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీ, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు జనవరి 2025 తర్వాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం(గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందిన వారి ఆదాయం రూ.2 లక్షలలోపు)తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఈఓ రేణుకాదేవి, డీసీఓ సాయిలత, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయకోట, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు

సకాలంలో హాజరుకావాలి

జిల్లాలో యూడీఐడీ/ సదరం క్యాంపులకు దివ్యాంగులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు అంగవైకల్యానికి సంబంధించి జూన్ 13, 19, 24, 25 తేదీల్లో, బుద్ధి మాంద్యం గలవారికి జూన్ 17, 18న, మూగ, చెవుడు గత వారికి జూన్ 26న, అంధులకు జూన్ 27న క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఫోన్ ద్వారా సమచారం పంపుతామని తెలిపారు. వారు మాత్రమే క్యాంపులకు హాజరు కావాలని సేచించారు.

అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతగిరి: రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని డీఏఓ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సుజాత, యమున పంటలు వేసేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందు వాడవద్దని సూచించారు. రైతులకు ఏమైన సందేహాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే నివృత్తి చేసి తగిన జాగ్రత్తలు సూచిస్తామని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఓ ప్రసన్న లక్ష్మి, ఏఈఓలు కావ్య, సరిత, ఫరీన్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష ఆధ్వర్యంలో ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. మోదీ పాలనలో అవినీతికి ఆస్కారం లేదని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కేపీ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పోకల సతీష్, నరోత్తంరెడ్డి, బుస్స శ్రీకాంత్, చరణ్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ పట్టణ నూతన కార్యవర్గం

పార్టీ పట్టణ ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, అశోక్ కుమార్, లక్ష్మారెడ్డి, భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శులుగా ఉప్పు అమర్‌నాథ్, వెంకట్, కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, వినోద్, సువాని, బాలలింగం, ప్రీతంగౌడ్, కోశాధికారిగా మామిడి రాంమోహన్‌ను ఎన్నుకున్నారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్

తాండూరు రూరల్: నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ తెలిపారు. బుధవారం తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దులోని సంగెంకలాన్ గ్రామాన్ని ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. మొదటి విడతగా 50 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తుందని చెప్పారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. ఈనెల చివరి వరకు బియ్యం చేస్తారని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, యూత్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

- అత్యంత మన్నికైనది భారతి అల్ట్రా ఫాస్ట్
- ఇంజనీర్లతో కంపెనీ టెక్నికల్ మేనేజర్ సునీల్ సమావేశం

తాండూరు టౌన్: వ్యాపార రంగంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ వర్ధిల్లుతోందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ అన్నారు. బుధవారం స్థానిక దుర్గా గ్రాండ్యుయర్ హోటల్‌లో పలువురు ఇంజనీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ఎంతో నాణ్యమైనదన్నారు. దీంతో నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుందన్నారు. అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణాన్ని చేపడితే ఎక్కువ కాలం నిలుస్తాయన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు భారతి సిమెంట్ కంపెనీ తరఫున ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. నేరుగా సైట్ వద్దకు వచ్చి సహాయం చేస్తారన్నారు. మార్కెట్‌లో ఉన్న ఇతర సిమెంట్ రకాలతో పోలిస్తే భారతి అల్ట్రా ఫస్ట్ రూ.20 అధికంగా ఉందన్నారు. అనంతరం డీలర్ రవీందర్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ ఎంతో మన్నిక కలదని, సర్వీస్ విషయంలో ఎంతో వేగంగా స్పందిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సతీష్ రాజు, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ వీరాంజనేయ రెడ్డి, టెక్నికల్ ఇంజనీర్ స్వామాట్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్లకు గిఫ్ట్ ప్యాక్‌లు అందజేస్తున్న సునీల్

క్లుప్తంగా

మరియా ఫీడ్ కంపెనీకి సీల్


మరియాఫీడ్ కంపెనీకి సీల్ వేసిన తహసీల్దార్ సాజిదాబేగం

ధారూరు: మండల పరిధిలోని దోర్నాల్ గ్రామ సమీప 113 సర్వేనంబర్‌లో ఉన్న మరియా ఫీడ్ కంపెనీకి తహసీల్దార్ సాజిదాబేగం బుధవారం తాళం, సీల్ వేశారు. కంపెనీ నుంచి దుర్వాసన వస్తోందని, ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని మంగళవారం రాత్రి గ్రామస్తులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ఆర్డీఓ వాసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆందోళనకారులను శాంతింపజేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నివేదిక వచ్చే వరకు కంపెనీని మూసేస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. అప్పటి వరకు ఫ్యాక్టరీలోకి వాహనాలు రాకుండా రోడ్డుకు అడ్డంగా ట్రెంచ్ తవ్వించామన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఏఎస్‌ఐ సంగమేశ్వర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


కళేబరం వద్ద రోదిస్తున్న రైతు

యాలాల: మేత మేయడానికి వెళ్లిన ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని దేవనూరులో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కిందికేరి మాజీద్ ఎప్పటిలాగే తన ఆవును మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. దేవనూరు నుంచి దుబ్బతండా వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రూ.50 వేల విలువ గల ఆవు మృతి చెందడంతో రైతు లబోదిబోమన్నాడు.

టీటీడీ ఆలయం హుండీలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలో నగదు దొంగలిస్తుండగా భక్తులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఆలయ వర్గాలకు అప్పగించారు. అయితే బాలుర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి చోరీ చేసిన నగదును తిరిగి హుండీలో వేయించి పంపించారు. అయితే కొద్ది రోజుల తర్వాత అందులో ఓ బాలుడు మళ్లీ ఆలయానికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆలయ ఏఈఓ రమేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 28న ఓ బాలుడు సన్నిధిలో ఉన్న హుండీలో నుంచి డబ్బులు తీస్తుండగా భక్తులు గమనించి తమకు అప్పగించారని, ఆ కొద్ది దూరంలోనే తమ విజిలెన్స్ సిబ్బంది మరో బాలుడిని పట్టుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హుండీ నుంచి చోరీ చేసిన రూ.1210 స్వాధీనం చేసుకుని తిరిగి హుండీలో వేయించామని, ఆ ఇద్దరు బాలురకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించి పంపించడం జరిగిందన్నారు. ఈ నెల 9న ఇందులో ఒక బాలుడు ఆలయ ప్రాంగణంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బస్ చార్జీలను తగ్గించండి

తుర్కయంజాల్: పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. తుర్కయంజాల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పెంచిన చార్జీలతో పేద ప్రజలు, విద్యార్థులకు ఆర్థిక భారం కానుందన్నారు. చార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.జగన్ మోహన్ రెడ్డి, టి.బాలయ్య, బీరప్ప, గంధం బాలరాజ్, నరేందర్, కాటమయ్య, రేఖ, అండాలు, సావిత్రి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్టు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

- సేడం సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం
- బషీరాబాద్ మండలం మైల్వార్‌లో విషాద ఛాయలు


శాంతుకుమార్(ఫైల్)


రైలు పట్టాలపై శాంతుకుమార్ మృతదేహం

బషీరాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు తెల్లారేసరికి రైలు పట్టాలపై శవమై కనిపించాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రం సేడం రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కర్ణాటక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం మైల్వార్‌కు చెందిన అంజిలమ్మ, మున్నెప్ప దంపతుల కొడుకు శాంతుకుమార్ మంగళవారం రాత్రి తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొనేందుకు కంసాన్‌పల్లి వెళ్లాడు. తిరిగి 10.30 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అంతలోనే ఓ నంబర్ నుంచి అతని సెల్ ఫోన్‌కు కాల్ వచ్చినట్లు కుటుంబీకులు గుర్తించారు. దీంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్ తీసుకుని తన అమ్మమ్మ గ్రామమైన కర్ణాటక రాష్ట్రం ముదినకు బయలుదేరాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ ఉదయాన్నే సేడం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడు. పోలీసుల సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున రోదించారు.

ప్రేమ వ్యవహారమే ప్రాణం తీసిందా..?

శాంతుకుమార్ ఇటీవలే పదో తరగతి పూర్తి చేశాడు. పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇతనికి అమ్మమ్మ గ్రామమైన ముదినకు చెందిన ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉందని తెలుస్తోంది. ఆమె ఫోన్ చేయడంతోనే మంగళవారం రాత్రి బైక్ తీసుకుని బయటకు వెళ్లినట్లు బాలుడి సన్నిహితులు తెలిపారు. అయితే ఆతర్వాత బాలుడు ఎక్కడికి వెళ్లాడు.. ఎవరితో మాట్లాడాడు..? అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. ఇదిలా ఉండగా తమ కొడుకును రైలు ఢీకొని ఉంటే తీవ్రమైన గాయాలు కావాలని, స్వల్పగాయాలతో ఎలా మరణిస్తాడని తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో హత్య చేసి పట్టాలమీద పడేశారని, బైక్ కూడా ఎత్తుకెళ్లారని సేడం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుల్బర్గా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతితో మైల్వార్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పరువు పోతుందనే హత్యకు పథకం

వరుసకు బావ అయ్యే వ్యక్తిపై యువకుడి హత్యాయత్నం

- కత్తి, ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి
- అడ్డు వచ్చిన బాధితుడి తల్లిని పొడవడంతో అక్కడికక్కడే మృతి
- రాపోల్ ఘటన వివరాలను వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: మండల పరిధిలోని రాపోల్‌లో మంగళవారం రాత్రి జరిగిన వృద్ధురాలి హత్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం ఘటనకు సంబంధించిన వివరాలను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం మీడియాకు వెల్లడించారు. గ్రామానికి చెందిన పొట్టి రాంచరణ్ ఇంటర్ ఫెయిలై జులాయిగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో ఖర్చుల కోసం వరసకు బావ అయ్యే రాజేందర్ ఇంట్లో తరచూ డబ్బులు దొంగిలించేవాడు. గత మంగళవారం రాత్రి సైతం రాజేందర్(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ఇంట్లో చోరీకి వెళ్లాడు. ఇది గమనించిన అతను అరవడంతో రాంచరణ్ పారిపోయాడు. ఈ విషయాన్ని తన స్నేహితులైన చంద్రశేఖర్(బన్ని)తో పాటు మరో యువకుడికి చెప్పాడు. తాను చోరీకి వెళ్లిన విషయాన్ని ఉదయాన్నే గ్రామంలో అందరికీ చెప్పి, తన పరువు తీస్తాడని భావించి, అతన్ని చంపేద్దామన్నాడు. ఇందుకు స్నేహితులు సైతం వంతపాడారు. ఆవెంటనే రాంచరణ్ తన ఇంటికి వెళ్లి కత్తి తీసుకుని, రాజేందర్ ఇంటికి చేరుకున్నారు. అతను నిద్రలో ఉండగా కత్తి, ఇనుప రాడ్డుతో రాంచరణ్ దాడి చేశాడు. మేల్కొన్న రాజేందర్ పెద్దగా అరవడంతో పక్క గదిలో పడుకున్న అతని తల్లి నర్సమ్మ వచ్చి, అడ్డుకుంది. దీంతో ఆమెను సైతం కత్తితో పొడిచి, బండరాయితో దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందింది. ఈ అలికిడికి చుట్టు పక్కల వాళ్లు లేవడంతో పారిపోయారు. దాడికి ఉపయోగించిన కత్తి, రాయి, ఇనుప రాడ్లను బావిలో పడేసేందుకు ప్రయత్నించగా.. కత్తి ఒడ్డుపైనే పడింది. రాంచరణ్, చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాటం..

దాదాపుగా 30కి పైగా కత్తి పోట్లతో తీవ్రంగా గాయపడిన రాజేందర్ గాంధీ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. కత్తితో దాడి చేసిన సమయంలో కొంత భాగం తలలో విరిగిపోయింది. ఆపరేషన్ ద్వారా కత్తి ముక్కను తొలగించినట్లు తెలిసింది. దాడిలో మృతిచెంది రాజేందర్ తల్లి నర్సమ్మ అంత్యక్రియలను బుధవారం పూర్తి చేశారు. కొడుకు లేకపోవడంతో భర్త చెన్నయ్య అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యు ఒడికి

- కారును ఢీకొట్టిన డీసీఎం
- వ్యక్తి మృతి, మహిళకు గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

బొంరాస్‌పేట: ఎదురుగా వచ్చిన డీసీఎం కారును ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని జాతీయ రహదారి 163పై మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవూఫ్ వివరాల మేరకు.. హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్న బీజాపూర్ వాసి కంచి వెంకటేశ్వర్‌రావు(48), భార్య కళ్యాణితో కలిసి కారులో తన కారులో కర్ణాటకలోని గానుగాపూర్ దత్తత్రేస్వామి దర్శనానికి వెళ్తున్నారు. ఈక్రమంలో బీజాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం భోజన్న గడ్డతండా గేటు వద్ద వీరి కారును ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న వెంకటేశ్వర్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా కళ్యాణికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను మొదట పరిగి ఆస్పత్రికి ఆతర్వాత హైదరాబాద్ తరలించారు. డీసీఎం డ్రైవర్ జానప్పపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అక్కసుతోనే దాడులు


గోవింద్‌నాయక్

పరిగి: ఏపీలో కొనసాగుతున్న అక్రమ అరెస్టులు, జర్నలిస్టులు, పత్రిక కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎల్‌హెచ్‌పీఎస్, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింగ్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావుపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపడం అప్రజాస్వామికమని తెలిపారు. ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. గత ఏడాది కాలంగా ఏపీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బయటపెడుతోందనే అక్కసుతో సాక్షి కార్యాలయాలపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రత్రిక స్వేచ్ఛను హరించే కుట్ర చేస్తున్న వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు తాము సిద్ధమని ప్రకటించారు.

శోభాయమానంగా గిరిప్రదక్షిణ


పాంబండ గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రతి పౌర్ణమికి నిర్వహించే గిరిప్రదక్షిణ కార్యక్రమం బుధవారం శోభాయమానంగా కొనసాగింది. భక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో పాంబండ క్షేత్రం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్ : చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట ఓఆర్‌ఆర్ సమీపంలోని బలిజగూడ రహదారిలో ఉన్న ఏఎల్ నగర్ వెంచర్‌లో బుధవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు వనస్థలిపురానికి చెందిన మనోహర్‌రెడ్డిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బీసీ హక్కుల కోసం నిరంతర పోరాటం


కమిటీని సన్మానిస్తున్న బర్క కృష్ణయాదవ్

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణాయాదవ్

షాబాద్: బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీసీసేన మండల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన మండల అధ్యక్షుడిగా దామర్లపల్లి గ్రామానికి చెందిన కమ్మరి దయాకర్‌చారిని నియమించారు. ఉపాధ్యక్షుడిగా గోపాల్, యూత్ అధ్యక్షుడిగా బండ అజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాయాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు కత్తి శేఖరప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోటావేటర్‌లో ఇరుక్కుని బాలిక మృతి


ప్రమాద స్థలంలో రోదిస్తున్న కుటుంబసభ్యులు

చేవెళ్ల: రోటావేటర్ ఓ బాలిక ప్రాణం తీసింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చేవెళ్ల మండలం తంగడపల్లి సమీపంలోని ఫామ్‌హౌస్‌లో కర్ణాటకకు చెందిన సుశీల్‌కుమార్, పద్మ దంపతులు పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. పద్మ చెల్లెలు కళావతి, సంజీవ్‌కుమార్ కుటుంబం వికారాబాద్‌జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఉంటోంది. అక్కను చూసేందుకు కళావతి భర్త, పిల్లలతో కలిసి మంగళవారం తంగడపల్లిలోని తోటకు వచ్చారు. బుధవారం మధ్యాహ్నం మామిడి తోటలో సుశీల్‌కుమార్ ట్రాక్టర్ రోటావేటర్‌తో దున్నతున్నాడు. అదే సమయంలో కళావతి కూతురు అక్షిత (11) ఆడుకుంటూ వచ్చింది. ప్రమాదవశాత్తు రోటావేటర్‌లో ఇరుక్కొని తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబసభ్యులు గమనించి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఎల్లమ్మ జాతర


అలంకరణలో అమ్మవారు

తాండూరు రూరల్: భక్తుల కొంగు బంగారంగా విశ్వసించే కోట్లాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర బుధవారంతో ముగిసింది. నెల రోజుల పాటు జరిగిన వేడుకలో తెలంగాణ–కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి మంగళవారం, శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రధానఘట్టం రథోత్సవం, సిడే ఉత్సవాలు గతంలోనే ముగిశాయి. ఏరువాక పౌర్ణమి సందర్భంగా భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ డైరెక్టర్ గోపాల్, గ్రామస్తులు ఉన్నారు.


క్యూలైన్‌లో భక్తులు

విత్తనశుద్ధితో తెగుళ్లకు అడ్డుకట్ట

నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త అలివేలు


రైతులతో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త అలివేలు

ధారూరు: పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి చేసుకోవాలని రాజేంద్రనగర్‌లోని నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అలివేలు రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ శంకర్‌మీనా, డాక్టర్ పుష్పలతో ఆమె మండలంలోని గురుదోట్ల, అంపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేప గింజలతో తయారు చేసిన పిండి, రైజోబియంను భూమిలో కలపడంతో భూసారం పెరిగి దిగుబడి బాగా వస్తుందన్నారు. శాస్త్రవేత్తలు పుష్ప, ఉషాకిరణ్, మీనలు మాట్లాడుతూ.. ఆముదం పంటపై రెండుసార్లు పాక్లోబ్యూడజోల్ మందును పంటపై పిచికారీ చేస్తే ఎత్తు తగ్గి దిగుబడి పెరిగి పంటకాలం తొందరగా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంస్థకు చెందిన ఝాన్సీ, పూజిత, తేజస్వీ తదితరులు పాల్గొన్నారు.


దుద్యాల్: హస్నాబాద్‌లో ర్యాలీగా వస్తున్న గ్రామస్తులు


బొంరాస్‌పేట: డప్పుమేళాలతో ఏరువాక ఉత్సవం


పూడూరు: కంకల్‌లో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎడ్లబండ్లు


ధారూరు: ఎద్దులకు స్నానాలు చేయించిన రైతులు

అంబరాన్నంటిన ఏరువాక సంబురాలు

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని అన్నదాతలు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా తమ ఎద్దులను బాజాభజంత్రీలతో బావులు, చెరువుల దగ్గరికి ఊరేగింపుగా తీసుకెళ్లి వాటికి స్నానం చేయించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ధాన్యరాశులు నిండాలని వేడుకున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున సంబురాలు నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్


తాండూరు టౌన్: ముస్తాబైన ఎడ్ల బండి


కుల్కచర్ల: హన్మాయిపల్లిలో కాడెడ్లతో ప్రదర్శన


కొడంగల్ రూరల్: ఊరేగింపుగా వెళుతున్న దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యుల ఎద్దు


మర్పల్లి: పట్లూర్‌లో ఎడ్ల బండ్లతో రైతులు


అనంతగిరి: సిద్దులూర్‌లో ఎడ్లబండ్లపై యువకుల కోలాహలం


మోమిన్‌పేట: టేకులపల్లిలో ఎడ్ల బండి ఊరేగింపు


దోమ: బొంపల్లిలో హనుమాన్ దేవాలయం చుట్టూ వాహనాలతో ప్రదక్షిణలు


బంట్వారం: కోట్‌పల్లిలో ఎద్దుల బండితో ఊరేగింపు


దుద్యాల్: అందంగా అలంకరించిన ఎద్దులతో రైతు రవి